దీపావళి కథల పోటీలో
పాఠకుల నిర్ణయానికై ఎంపిక చేసిన కథ

# అమ్మ మనసు




ఈ తాకుల చాపమీద అడ్డదిడ్డంగా పడుకుని ఆదమరచి నిద్రపోతున్న అంకడు చివుక్కున కళ్లు విప్పాడు. చుక్కమ్మ పాడిన సుప్రభాతం చెవుల్లో పడగానే.

“బేగి లేవరా... దొంగసచ్చినోడా.... ఈమద్దిన నిద్దరెక్కువైపోనాది నీకు... నిద్దర మొహమాని... నిద్దరమొహమా....

నిట్టాడి నుంచి వేళ్లాడుతున్న లాంతరు వెలుగు కళ్లు చెదరగొడుతుంటే... చిరాగ్గా అటు తిరిగి మళ్లీ కళ్లు మూసుకున్నాడు అంకడు.

ఆ లాంతరు వెలుతురంటే వాడికి ఒళ్లుమంట. కిరోసిన్ దండగని పడుకునేటప్పుడు లాంతరు ఆర్పేస్తుందామె... అప్పుడు ముసురుకునే చీకట్లో... అంకడి కళ్ల ముందు నుంచి నిట్టాడి గుడిసె... చింకీచాపలూ... చిల్లి కుండలూ... సొట్టలుపడ్డ సత్తు పళ్లాలూ... ఇవన్నీ మాయమై పోతాయ్.

కళ్లు అలా మూసుకుంటాడో లేదో... వెంటనే ఓ మంచి బంగళా... అందులోని అందమైన పడక గదీ... మెత్తటి పరుపూ ప్రత్యక్షమవుతాయ్.

తెల్లారగట్ల చుక్కమ్మ లాంతరు వెలిగిస్తుంది. అలా వెలిగించిందీ అంటే – పన్లోకి పోడానికి రెడీ అవుతోందన్నమాటే. ఇక ఆమెతోపాటు అంకడూ లేవాలి – పన్లోకి వెళ్లాలి.

అమ్మా – కొడుకులిద్దరూ ఒకే చోట పనిచేస్తున్నారు. ఆ ఇల్లు బంగళాలాగా వుంటుంది. అందులోని మనుషులు రాజుల్లాగా, రాణుల్లాగా వుంటారు.

చుక్కమ్మ బంగళా అంతా ఊడుస్తుంది. వాళ్లు తిని పడేసిన ఎంగిలి కంచాలన్నీ శుభ్రంగా కడుగుతుంది. విప్పేసిన బట్టల్ని తళతళలాడేలా ఉతుకుతుంది.

ఆ బంగళా యువరాజు అనిల్‌బాబును అంకడు నిద్రలేపుతాడు. బ్రష్షూ, పేస్టూ అందిస్తాడు. స్కూల్ బేగ్ బస్‌లో పెడతాడు. సాయంత్రం, అనిల్ ఇంటికి రాగానే మళ్లీ స్కూల్ బేగ్ తెచ్చి లోపల పెడతాడు. ఈమధ్యలో ఆ ఇంటి యజమాని చెప్పిన చిన్న చిన్న బజారు పనులన్నీ చేస్తాడు.

అనిల్ ఎప్పుడైనా టైమ్ అడ్జెస్ట్ కాక – టిఫిన్ చెయ్యకుండా స్కూల్‌కి వెళ్ళిపోతే – బాక్స్ తీసుకుని–అనిల్ బస్‌లోవెళ్లిన దూరాన్ని కాలి నడకతోనే కవర్ చేసుకుంటూ వెళ్లి అందించి వస్తాడు.

మొత్తమ్మీద చుక్కమ్మకి గానీ... అంకడిగ్గానీ క్షణం తీరికుండదు. ఎన్ని పనులు చేసినా ఏదో ఒక పని అప్పటికప్పుడు పుడుతూనే వుంటుంది. లంకంత కొంపాయె. సాయంత్రానికి రెక్కలు ముక్కలైనట్లుగా అన్పిస్తుంది.

ఇంటికొచ్చి ఈతచాపమీద పడుకోగానే నిద్ర ముంచుకొస్తుంది. నిద్రలో ప్రాణం ఎటో పోతుంది. చీకటి ఉన్నంతసేపు ఆసుఖం. వెలుగొచ్చిందంటే రాత్రంతా తీపులు తీసిన రెక్కలు ... డొక్కల కోసం ఆడి తీరాల్సిందే.

అందుకే లాంతరు వెలుతురే వాడికి గిట్టదు. ఆ వెలుతురుతో పాటూ వినబడే తల్లి స్వరమంటే మరీ కోపం అంకడికి.

"ఎద్దులాగా తొంగుంటే... బువ్వెట్టొస్తాదిరా సన్నాసోడా... లెగులెగు...

చుక్కమ్మ విసురుగా అంకడి భుజాలు పట్టి ఊపింది ఇకలాభం లేదన్నట్టు లేచి కూర్చున్నాడు. అనిల్ బాబునైతే, వాళ్లమ్మ.... లే నాన్నా... నాబంగారు కదూ... నాబుజ్జి కదూ... అంటుంది.

లేవగానే 'గుడ్‌మార్నింగ్' అంటూ బుగ్గమీద ముద్దిస్తుంది. అందుకే తల్లిని మింగేసేలా చూశాడు అంకడు.

"సీ....యమ్మ – మంచిదే గారు... కొరివిదెయ్యం..." అనుకున్నాడు విసుగ్గా.

"ఏందాసూపు... పైడికంటిలా... లెగెహె – లెగు..." అంకడు లేచి చాపచుట్టి మూలనపెట్టాడు. పొంతలో నీళ్ళు ఒక్కసారి పుక్కిలించి చూరులోంచి బయటకు ఊశాడు. సత్తు పళ్లెంలో చుక్కమ్మ రెడీగా వుంచిన సల్ది తాగాడు – ఉల్లిపాయ నంజుకుంటూ.

తాగుతున్నప్పుడు మళ్లీ గుర్తొచ్చింది అనిల్ టిఫిన్ చేసే విధానం –

రెండు మూడురకాల టిఫిన్లు తయారు చేసి బల్లమీద పెడతాడు అయ్యరు. అనిల్ వచ్చి కూర్చుని ... అన్ని రకాలున్నా... అవేం వద్దని పేచీ పెడతాడు.

తల్లి అయ్యర్‌ని కోప్పడ్డట్టు నటించి... అనిల్‌ని బుజ్జగించి – నోటి కందిస్తుంటే... గుటుకూగుటుకూ మంటూ మింగుతాడు.

"యాందిరా... దోసెడు గుట్టి నీళ్లు ఇంతసేపు నంజుతుండావ్ – నీ మొహం మండ... తొరగా తాగి సావరా..."

చుక్కమ్మ అరిచింది పెద్ద గొంతుతో! "ఈ దెయ్యం అమ్మకాదు..పిశాచం.. రాచ్చసి..." కసిగా అనుకుని పళ్లెం తీసుకుని లేచాడు.

✿ ✿ ✿

గేటు ముందు కాంటెస్సా.... ఆగీ ఆగడంతోటే... హడావిడిగా గేటు తెరిచాడు వాచ్‌మెన్. డ్రైవర్‌దిగి కారుడోర్ తెరిచి పట్టుకున్నాడు. హుందాగా దిగింది నీలిమ. ఆమె వెనకే చెంగునఎగిరిదూకాడు ఎనిమిదేళ్ల నిఖిల్.

నీలిమ కొడుకు వేలు పట్టుకుని నవ్వుతూ గేటు లోపలికి వెళ్లబోయిందల్లా చప్పున, ఆగిపోయింది.

గేటుకు కాస్తా దూరంలో ప్రహరీ గోడ వారగా ముడుచుకుని కూర్చుని ఆమెవంక దీనంగా చూస్తున్నాడు – దాదాపు నిఖిల్ వయసే వున్న ఓకుర్రాడు.

నీలిమ ఆ కుర్రాడికేసి చూడ్డం గమనించి చెప్పాడు వాచ్‌మేన్... ఎంత అరిచినా పోలేదమ్మా... రెండు గంటల నుండీ ఇక్కడే కూర్చుని వున్నాడు...

చెప్పాక.... ఆ కుర్రాడికేసి కోపంగా చూశాడు..."రేయ్ పోరా... పో" అన్నాడు.

చేత్తో సైగచేసి వాచ్‌మెన్ని వారించింది నీలిమ. ఆ కుర్రాడ్ని దగ్గరకు రమ్మని పిలిచింది. వాడు మెల్లగా లేచి భయపడుతూ ఆమెను సమీపించాడు.

"ఎవరు బాబూ నువ్వు? ఏంకావాలి?"

"నా పేరు రాజు. గాలివానకు ఇల్లు కూలి మా అమ్మానాన్నా చచ్చిపోయారు. నాకెవరూ లేరు... ఆకలేస్తోంది..."

అడుక్కోవటం కూడా చేతకాని ఆ పసివాడ్ని చూసి నీలిమ కరిగిపోయింది. ఒక్క క్షణం ఆలోచించి – తనతో పాటు లోపలికి తీసుకుపోయింది.

తన కొడుకు నిఖిల్‌తోపాటూ– రాజును బాత్‌టబ్‌లో కూర్చోబెట్టి స్నానం చేయించింది.

డైనింగ్ చెయ్యటంలో కూడా తేడా చూపించలేదు.

"నిక్కీలాగే నువ్వూ నా బిడ్డవి. దేవుడిచ్చిన బిడ్డవి..." అని – రాజు నోటికి అన్నం కలిపి అందించింది.

"నిక్కీ! నీకు ఈరోజునుంచీ నీ తమ్ముడు ..." అని చెప్పింది. నిఖిల్‌నీ – రాజునీ – ఒకే బెడ్ మీద పడుకోబెట్టి నిద్ర పుచ్చింది. వాళ్లిద్దర్నీ చూస్తూ ఆలోచనల్లో పడింది. 'అతిగా ఏమన్నా చేస్తున్నానా? అని కూడా అనిపించింది నీలిమకు –'ఏంకాదు' అని మనసుని సర్దిపుచ్చింది.

రాజు నిద్రలో లేచి కూర్చుని ... "అమ్మా.... అమ్మా..." అని కలవరిస్తుంటే... ఎత్తుకుని ఓదార్చింది.

వాడి బుగ్గమీద ముద్దిచ్చి...." నేనేరా మీ అమ్మను. ఇకనుంచీ నువ్వు నన్ను అమ్మా అని పిలవాలి – తెలిసిందా?" అని చెప్పింది – గారాబంగా వాడి ముఖంకేసి చూస్తూ.

చప్పున పవర్ ఫెయిలయింది. శ్రద్ధగా టీవీ స్క్రీన్‌కేసి చూస్తున్న అంకడు నిరాశగా లేచాడు.

తీరిక దొరికినప్పుడల్లా అనిల్ గదిలో టీవీ చూస్తుంటాడు అంకడు.

ఇన్ని రోజులు చూసిన సినిమాలన్నీ ఒక ఎత్తు. ఈ రోజు చూసిన సినిమా ఒక ఎత్తు అనిపించింది - అంకడికి.

✿ ✿ ✿

వరండాలో ఓ మూలగా మోకాళ్లమీద తలపెట్టుకుని కూర్చునివున్న అంకడికి - ఇంకా ఆ సినిమా కళ్లముందు మెదులుతోంది.

"ఆ చిల్మాలో యమ్మ శానా మంచిది నాగున్నాది. అసిలికి అసుమంటమ్మ పెపంచ కంలో వుంటుందా అని... ఈయమ్మ వొక్క దినం పన్లోకి ఎగ్గొట్టి సావాసగాండ్లతో బిల్లం గోదు ఆడినా బూతులు దిడతాది... సింతబరిసె విరిసి. ఈపు సిట్లగొడతది. ప్చ్... తనకి బగమంతుడు ఇసుమంటమ్మనీకుండా... ఆ చిల్మాలో అసుమంటియమ్మ నీగూడదా... చా... అనీలు బాబుయమ్మ గూడా మంచిదే... గానీ... ఆడ్నే బాగా సూసుకుంటుంది... ఏరే వోల్లను సీకొట్టేస్తది... అనీలుబాబుకు బల్లమీద నాస్టా ఏసి, తనికి నేలమీద ఏస్తది... చిల్మాయమ్మ అట్టగాదు... గేటుకాడ కూకున్న ఓరి పిల్లోడ్నీ గూడ.... తానమాడించి... సొంతబిడ్డనాగ సాక్కుంటాంది.

"ఒరేయ్... అంకడా... శనెదవా... ఏడ నచ్చినావ్‌రా... బాబొచ్చే ఏలాయె... గేటుకాడ దిగబడు... ఆబాబసలే మెతకమడిసి.. ఇస్కూల్ బేగెత్తనేడు... దించనేడు...." అంకడికి తల్లిగొంతు అమాంతం నులిమెయ్యాలన్పించింది.

"దోసిదోసి పెడతంటే కమ్మంగ పీక ల్దాకా మెక్కుతాదాబాబు... ఇస్కూలు బేగు మాత్తరం... ఎత్తనేడు. సీకట్లో అన్ని సద్దినీల్లు తాగి... ఆల్లు తిని పారేసిన ఎంగిల్లు నాకే తనికి మాత్తరం బో బలముండది...."

ఛూ... యామి తల్లిది.....

"లెగరా... దరిద్రగొట్టోడా... "చుక్కమ్మ తిడుతూనే వుంది.

ఎందుకో అంకడి కళ్లలో గిర్రున తిరిగాయి నీళ్లు. ఎడం చేత్తో తుడుచుకుని లేచి వెళ్లి గేటు దగ్గర నిలబడ్డాడు. మళ్లీ ఊరాయి కళ్లల్లో నీళ్లు.

"శ్చ... ఒప్పుడు జూసినా... దరిద్దర పోడా... సచ్చినోడా.... ఎదవసన్నాసీ... అని తిడుతూనే వుంటుంది. ప్చ్. తన్నిగూడా... ఓరైనా అనీలుబాబును పిల్చినట్టు... బాబూ! అని పిలగూడదా... ఒకేల... ఆ చిల్మాలోయమ్మ దగ్గరకుబోతే... అట్ట బిలుస్తందేమో....

ఒక్కసారిగా మెదిలింది. ఆ సినిమాలోని నీలిమ-అంకడి కళ్లముందు దేవత లాగా.

కళ్లనిండా కరుణ నింపుకుని.. చేతులు చాపి... రా... రమ్మని... పిలుస్తున్నట్టు అనిపించింది అంకడికి.

"ఒక్కసారి-ఎల్లి...ఆయమ్మను జూత్తే.. యమ్మా... అని పిలిస్తే.. ఎట్టా గుంటదో..."

ఆరాత్రికి పని ముగించుకుని గుడిసె చేరాక.... పక్క గుడిసెలోని రాజిగాడి దగ్గరకెళ్ళి కూర్చున్నాడు అంకడు.

"రాజన్నా... యమ్మమణుసు చిల్మా జూసినవా నిన్న... టీవీల ఏసింద్రు...."

ఆరాజుగాడనబడే రాజన్న ఒక్క క్షణం ఆలోచనలో పడిపోయి - తలగోక్కుని చెప్పాడు.

"జూసినా గానీ... టీవీల గాదు చిల్మా ఆల్లో జూసినా..."

దాంట్లో యమ్మ ఏసం గట్టిందే ఆమె పేరేందో?..."

"కిష్నపెబో - దెవ్విరోపో...బో... జేస్తదిలే యాకసన్ను..."

"ఆమె...ఏడుంటది?"

"యాకటేర్లంతా... మెద్రాస్‌లోనో... అయిదరాబాదులోనో వుంటరు. ఈముండేది... మెద్రాస్‌లో అయ్యుంటాది...

"అడ్రసు దెల్సా నీకు?"

"యామిరో యాంజేస్తవ్... అడ్రాసుతో. ఆడిగి బోతవా ఏంది... ఇసిత్రంగా వుండాదే నీ పెశ్న?

"ఊరికినేలే అన్నా...."

"నాకు దెల్దుగానీ... నాను పనిసేసే ఇంట్లో సినబాయిగారికి ఈ యాకటేర్ల కతలన్నీ దెల్సు అడిగి దెచ్చిస్తలే..."

"నీ జిమ్మడ - యాడ తగలడ్డవ్‌రా... బేగిరారా... ముస్లెదవా... కూసింత సేవన్నా పడుకోని సద్దాం... ఇట్ట కన్ను గురికి తెరిసేనోగా అట్టా దెల్లారిపోతండాది..." చుక్కమ్మ పిలుస్తోంది కొడుకుని.

అంకడికి విసుగొచ్చింది... అయినా లేచి.... రాజిగాడి గుడిసెలోంచి బయటికి వచ్చి మళ్ళీలోపలికి తొంగిచూసిచెప్పాడు- "మరిసిపోబాకన్నా...."

✿ ✿ ✿

ఒళ్లంతా కదిలిపోయేలా విరగబడి నవ్వింది దివ్యరూప. ఇప్పుడిప్పుడే ఫీల్డ్‌లో పైకొస్తున్న వర్ధమాన నటి ఆమె.

అలా నవ్వుతున్నప్పుడు పవిట జారిపోయిన - ఆమె పయ్యెదవైపే రెప్పవాల్చకుండా చూస్తున్నాడు డైరెక్టర్ సావేరి - గుటకలు మింగుతూ!

ఇందాకట్నుండి "రా" కొడుతున్నా ఎక్కని కిక్కు ఇప్పుడెక్కిందతనికి... ఆమె మీదకు ఎగబడి తేనెలో మాగిన చెర్రీస్‌లావున్న పెదవుల్ని ఆబగా అందుకోబోయాడు.

చప్పున జరిగి - అందకుండా తప్పించుకుని - అన్నది దివ్యరూప. "బెడ్ రూమ్‌లో మాత్రం మీ కళ్లకు గ్లామరస్ బొమ్మని. తెరమీద మాత్రం అమ్మనీ - అమ్మమ్మనీ..."

సావేరి ఆమె పెదవులు అందలేదన్న కసితో మరో పెగ్గు చప్పరించి అన్నాడు. "మంచి పెరఫార్మెన్స్ ఉన్న పాత్ర అది రూపా! నువ్వే చెయ్యగలవనిపించి నీకు ఆఫర్‌చేశాను గానీ... నీలో గ్లామర్‌లేదనీ... నువ్వాటైపు రోల్స్‌కి పనికిరావనీ కాదు...."

"నీ ఉద్దేశ్యం వేరు... నాకొచ్చిన ఇమేజ్ వేరు. ఒక్కసారి ఈ ఫ్యాన్స్ మెయిల్ చూడండి..."

టేబుల్ మీద కుప్పగా పోసి వున్న ఉత్తరాల్లోంచి కొన్నితీసి సావేరి చేతిలో కుక్కింది.

"అమ్మ మనసుకు నిర్వచనంగా నిలిచారు...."

"అమ్మ అనే మాటకు ప్రాణం పోశారు...."

"ఇంకెప్పుడూ మీరు గ్లామర్ రోల్స్ వేయవద్దు...."

"అమ్మగా మా హృదయాల్లో పవిత్రంగా హత్తుకుపోయిన మిమ్మల్ని ఇకమీదట ఏ డేన్సింగ్ గాల్‌గానో చూడలేము..."

"అమ్మా! నిన్ను చూడాలని వుంది. నీ ఒళ్లో పడుకుని ఆసినిమాలో రాజులా నిద్రపోవాలని వుంది. ఒక్కసారి నన్నెత్తుకుని ముద్దుపెట్టుకోవూ..."

అన్ని వుత్తరాల్లో ఇవే మాటలు... దివ్యరూపని అమ్మపాత్రలలోనే కొనసాగమని – అమ్మగానే ప్రేమను పంచివ్వమని..

సావేరి గాఢంగా నిట్టూర్చాడు.

"నిజంగా 'అమ్మమనసు' ఎంత మంచి సబ్జెక్ట్. పబ్లిక్ మీద ఇంత గాఢమైన ముద్ర వేయగలిగిన నీ నటనకు వచ్చిన కాంప్లిమెంట్స్ ఇవి... నటనలో నువ్వు సాధించిన పరిపక్వతకు నిదర్శనాలీ ఉత్తరాలు. బాధపడతావెందుకు రూపా!?"

దివ్యరూప ఏదో అనబోయేలోగా ఫోన్ రింగయింది. మాట్లాడేసి– సావేరివైపు తిరిగి–

"మీ సినిమాతో నా నటనకాదు మహాశయా... జీవితమే పరిపక్వమైనట్టుంది నాకు..." అంది కసిగా.

"నా నెక్స్ట్ పిక్చర్‌తో నీ ఇమేజ్ మార్చే బాధ్యత నాది. ఓసీన్‌లో స్విమ్ సూట్... పాటల్లో ఎక్కువగా షార్ట్స్ – బొడ్డుని బాహాటంగా చూపించే సన్నివేశాలూ... వాడామంటే – అమ్మవు కాస్తా అందాల బొమ్మవైపోతావు... సరేనా...."

దివ్యరూపకి ఆనందం కలిగింది. సావేరిని గట్టిగా వాటేసుకుంది. తేరుకుని – పోర్టికోలో వున్న కారు ఎక్కారిద్దరూ వాచ్‌మేన్ గేట్లు బార్లా తీసి నిలబడ్డాడు.

డ్రైవ్ చేస్తున్న సావేరి కారును గేటు దాటించబోతూ షడన్ బ్రేకు వేశాడు.

కారుకు అడ్డంగా నిలబడివున్నాడు అంకడు చేతులు బారజాపి.

వాచ్‌మేన్ హడావిడిగా వెళ్లి వాడ్ని రెక్క పుచ్చుకుని ఇవతలకు లాగబోయాడు. వాడు తీవ్రంగా గుంజుకుంటూ మళ్లీ కారుకు అడ్డం పడ్డాడు.

విండోగ్లాస్ డౌన్‌చేసి, వాచ్‌మెన్‌కేసి చూసింది – ఏమిటన్నట్టు దివ్యరూప.

"ఈ కుర్రాడెవరో రాత్రనగా వచ్చాడు మేడమ్ 'అమ్మ మనసు' సినిమాలో అమ్మగా వేసినామె ఇల్లు ఇదేనా అన్నాడు. అవును అన్నాను. ఇంకంతే... లోపలికి పోనీమని ఒకటే గొడవ. కాదు పొమ్మంటే... ఒక్కసారి అమ్మను చూస్తానంటూ కాళ్లకు చుట్టుకున్నాడు. గదమాయించి, పంపేశా. వెళ్లిపోయాడేమో అనుకున్నా ఉదయాన్నే చూస్తే – ఆ ప్రహరీగోడ కిందే పడుకుని కనిపించాడు. తిండీ – తిప్పల కూడా ఎక్కడికీ వెళ్లలేదు. "అమ్మా.... అమ్మా... అని ఒకటే కలవరింతలు..." చెప్పటం ఆపాడు వాచ్‌మెన్.

ముఖం జీవురించింది దివ్యరూపకి.

వాచ్‌మెన్ని, తోసేసి కారు విండో దగ్గరకి రావాలని ప్రయత్నిస్తున్న అంకడ్ని కళ్లు చిట్లించి ఎగాదిగా చూసింది.

ఎండిపోయిన దేహాన్ని కప్పుతూ మాసిపోయిన 'లాగూ, నిక్కరూ... ఒంట్లోని ప్రాణమంతా కళ్లలో కొచ్చినట్టు – ఆశగా కదిలే కళ్లూ... దుమ్ము కొట్టుకుపోయిన జుట్టూ....

"చిల్మాలో యమ్మవు నువ్వే గదా! నిన్ను సూడాలనీ... యమ్మా అని పిల్వాలనీ... నెల్లూరు నుంచొచ్చినా... మాయమ్మ పిచాచి. రాచ్చసి.... నచ్చేట్టుగొడతాది. బూతులు దిడతాది... అచ్చు కొరివిదెయ్యం నాగా వుంటుంది... నువ్వట్టగాదు. బువ్వదినిపిస్తావ్. ఎత్తుకొని... ఆడిస్తవ్... ముద్దుబెట్టుకుంటవ్... అందికే... నిన్నెదుక్కుంటూ... నీకాడికి లగెత్తు కొచ్చినా... నీ దగ్గర్నే వుంటా... ఒక్కసారి నిన్ను యమ్మా... అని...."

దివ్వరూప ఇక వినలేనట్టు – చకచక, విండో గ్లాస్ రైజ్ చేసేసింది.

అంకడేదో అంటున్నాడు గాని – అద్దంలోంచి ఆమెకేం వినపడ్డంలేదు.

"చూశారా.... ఏ డ్రీమ్ గాళ్‌గానో – కుర్రాళ్ల గుండెల్లో నిలిచిపోవాలని, కలలు కంటున్న నేను .... అడుక్కుతినే వెధవల చేత 'అమ్మా' అని పిలిపించుకుంటున్నాను. ఛా..."

"సినిమాలో నీనటన చూసి.... వాడు నిజంగా, నిన్ను 'అమ్మా' అని పిలవటానికి ఇంతదూరం వచ్చాడంటే... హేట్సాఫ్ టు యువర్ పెర్‌ఫార్మెన్స్..."

దివ్య అసహనంగా చూసి... "ఒక్కసారి మీరిలారండి..." అంది తను డ్రైవింగ్ సీట్లోకి మారుతూ.

సావేరి కామ్‌గా ఇవతలికి జరిగాడు.

అంకడు డ్రైవింగ్ సీట్ దగ్గరికొచ్చి... దివ్యరూప వైపు ఆశగా చూస్తున్నాడు. తనని చూడమని సైగ చేస్తున్నాడు.

దివ్యరూప, నిశ్శబ్దంగా కారు స్టార్ట్ చేసింది. కారు మెల్లగా కదులుతుంటే అంకడు దానితోపాటూ పరుగెత్తుతున్నాడు... ఓ పది గజాల దూరం... అలాగే... మెల్లగా పోనిచ్చిం దామె.

ఆ తరువాత ఎదురైంది.

డ్రైనేజి పైపులు పగిలి.... బురద బురదగా మారిన రోడ్డు. రోడ్డంతా డ్రైనేజి వాటర్‌తో నిండిపోయి వుంది.

కారు చక్రాల్ని సరిగ్గా బురదలోకి రానిచ్చి ఒక్కసారిగా స్పీడ్ పెంచేసింది. కారుతో పాటుగా సమాంతరంగా పరిగెత్తుకొస్తున్న అంకడి ఒంటినిండా, కళ్లనిండా స్ప్రేయర్‌లోంచి చిమ్మినట్లుగా పడింది బురద చిక్కగా!

పరుగెత్తేవాడల్లా చటుక్కున ఆగిపోయి – అందకుండా వెళ్లిపోతున్న అమ్మ వంక అలాగే చూస్తుండి పోయాడు అంకడు. వాడి కళ్లల్లో బురదతో నిండిన కన్నీళ్లు.

"బాస్టర్డ్ ... ఈ బురద వెధవకి నేను అమ్మనట..." అని దివ్యరూప తిట్టుకోవడం – అంకడి చెవులకి వినబడకపోయినా మనసుకు స్పష్టంగా వినబడింది.

✿ ✿ ✿

అంకడు చింతబరికె విరిచి చుక్కమ్మ చేతికిచిక్కాడు. చొక్కా విప్పి పారేసి – వంగుని నిలబడ్డాడు.

"యమ్మా... గొట్టే... నీయిట్ట మొచ్చి నట్టు గొట్టు. నచ్చేలా గొట్టు... మళ్లింక లేవకుండా గొట్టు...."

చుక్కమ్మ చేతిలోని చింతబరికెను విసిరిపారేసి – అమాంతం అంకడ్ని వాటేసుకుని బావురుమంది. వాడి ముఖాన్ని ముద్దులతో ముంచెత్తింది.

"నాయినా... నా బంగారు తండ్రీ.... నీకోసరం కలవరిచ్చి.. కలవరిచ్చి ఈయమ్మ పేనాలు పోకముంగలే... నువ్వు దిరిగొచ్చి నవ్... నాకంతే సాలయ్యా... సాలు..."

చుక్కమ్మ వెక్కి వెక్కి ఏడవసాగింది.

"యమ్మేంది... తన్నీ... నాయినా... బంగారితండ్రీ... అంటాంది..."

అంకడి కళ్లకు నీటిపొర కమ్మింది. గుండెల్లో పొగిలి పొగిలిపోతున్న దుఃఖం

గొంతులో కొచ్చేసింది.

"చిల్మాలో యమ్మ కోసరం లగెత్తాలని నువ్వు రెక్కలు ముక్కలు సేసుకుని సంపాదిచ్చిన జీతం రూకలు దొంగ నాగా అట్టుకుపోయానే యమ్మ...."

"పోతేపోయెలేరా... ఎదవ డబ్బు.... నీకన్నానా...."

"నిన్ను పిశాచి... రాచ్చేసి... అని దిట్టుకునేటోడ్నే..."

"తిట్టుకోరా... కావల్నెంటే కొట్టు... నాబిడ్డగాక నన్నింగ ఓరు దిడతారు... ఓరు గొడతారు... ఆc..."

"యమ్మా..." అంకడి గొంతు పూడుకు పోయింది. చిన్నగా అడిగాడు." ఇంతమంచి మడిసివి. నన్ను దేనికనీ అట్టా గొడ్తా - దిట్టేదానివి..."

అంకడి ప్రశ్నకు జవాబుగా చుక్కమ్మ వాడ్ని మళ్లీ ఆర్తిగా గుండెలకు హత్తుకుంది. ముద్దాడింది...."

"తల్లి - బిడ్డను దిట్టనాదంటే.... అయి తిట్లు గాదయ్యా... దీవెన్లు... ఆడ్ని బాగుసెయ్యాలని కొట్టుద్ది... గాని.... బంగపాటు సెయ్యాలని గాదు.... తన బిడ్డ పెదిమందిలో సెబాసుగా వుండాలని తాపత్తయపడుద్ది...."

అంకడు ఆమె బాహువుల్లోకి మరింతగా ఒదిగిపోతూ - మనస్ఫూర్తిగా నోటి నిండుగా పిలుచుకున్నాడామెను.

"యమ్మా...."

✿ ✿ ✿

ఆరోజు తెల్లారగట్లే చుక్కమ్మ లేచి పోయి లాంతరు వెలిగించింది. "నాయినా.... అంకా.... లెగరా... కన్నా..." అంది.

అంకడు కళ్లు తెరిచి తల్లికేసి చూశాడు. ఆమె నవ్వుతూ వాడి తల నిమిరింది.

"యమ్మో.... ఇట్టాగయితే నాకు మల్ల నిద్దరొస్తది... వనెగ్గొడ్త - సెడిపోతా... అందుకని... రోజునాగే పిలవ్వేయమ్మా..."

చుక్కమ్మ పక్కుమని నవ్వి "ఒరే దొంగ సచ్చినోడా... లెగరా - లెగు. బేగిలెగు..." ఆమె ఆమాటలంటూ మళ్లీ మళ్లీ నవ్వింది. అంకడూ హాయిగా నవ్వేశాడు.



# సంతాపం

...శేష సాహిత్య సేవలందించి భౌతికంగా దూరమైన ఉత్తమ ... మేధావి సహవాసికి చినుకు మాసపత్రిక తన ప్రగాఢ సంతాపం

## సహవాసి గురించి

'చెన్ చాంగ్ ఫింగ్' తెలుగు దేశంలో పుడితే, తెలుగులో ఈ పుస్తకం (లాంగ్‌మార్చ్‌లో మావోజెడాంగ్) రాసిఉంటే, అచ్చు ఇలాగే రాసి ఉండే వాడు'

**- కొడవటిగంటి కుటుంబరావు**

'నేను ఒరిజినల్‌పుస్తకాన్ని (రక్తాశ్రువులు)ఇంగ్లీషులో చదువు తున్నప్పుడు కంటె తెలుగులో చదువుతున్నప్పుడు అది నన్ను ఇన్‌స్పైర్ చేసింది'

**- కె.వి. రమణారెడ్డి**

"శ్రీశ్రీ మహాప్రస్థానం చదివి చాలామంది కమ్యూనిస్టులయినట్టు, సహవాసి ఏడు తరాలు, రక్తాశ్రువులు, విముక్తి ఉక్కుపాదం చదివిన చాలా మంది నక్సలైట్ లయ్యారు"

**- చలసాని ప్రసాద్.**

"అనువాదంకోసం అనువాదంకాకుండా మూలంలోనిభావాన్ని అందమైన తెలుగులోకి అనుసృజన చేసి అనువాదప్రక్రియలో తనదైన ముద్రవేసిన అత్యంతప్రతిభావంతుడు సహవాసి"

**- అదృష్టదీపక్**

" తెలుగులో అత్యుత్తమ అనువాదకుడు సహవాసి. ఆయన అనువాద మయినా, సంపాదకీయమయినా,పత్రికావ్యాసమయినా, సహజంగా ప్రౌఢంగా ఒక జీవనదీప్రవాహంలా సాగిపోతుంది. ఆయన పేరులేకపోయినా ఆయన శైలినిబట్టి ఇది సహవాసి రచన అని చెప్పగలిగే పాఠకులు ఆంధ్రదేశంలో అనేక మంది ఉన్నారు."

**- ఎ. గాంధీ**

"అనుసృజనలో అందెవేసిన చెయ్యి సహవాసి అని సహవాసిని అందరూ చెప్పుకోవడం వెనుక సహవాసి తపన, కృషి, మానవీయ అంతరంగం, నిరంతర సాహిత్య అధ్యయనం పడుగు పేకలా కలగలిసి పోయున్నాయి"

**- వెనిగళ్ల వెంకటరత్నం**

'సరళమైనశైలి, సిద్ధాంత తాత్విక భూమిక కలిగిన చారిత్రక రాజకీయ అవగాహన, భాషపై మక్కువ త్రిగుణాలై సహవాసిగారి అనువాదశైలిని ప్రకాశవంతం చేశాయి !

**- నండూరి రాజగోపాల్**

"మూలానికి / ముడితెలుగు చెప్పడం / తెలియపర్చడం
మూలాన్ని / నుడితెలుగులో చెప్పడం / తెలుగుపర్చడం
అందమైన అను సృజన సహవాసి జమానా
అందుకు ఆయన ప్రతి రచనా తిరుగులేని నమూనా

**- అశోక్ కుమార్**

సహవాసి 1934లో సెప్టెంబరు 26వ తేదీన గుంటూరు జిల్లా దుగ్గిరాలలో జన్మించారు. ఎంతో కాలంగా తనను ఆవరించిన అనారోగ్యాన్ని లెక్కచేయకుండా తన సాహితీ వ్యాసంగాన్ని కొన సాగిస్తూ.. కొనసాగిస్తూ 29ఆగష్టు, 2007న వైద్యం నిమిత్తం హైదరాబాదు వెళ్తూ ఆఖరిశ్వాస విడిచారు.